# తీర్పు

మొక్కలను చూస్తూ ఇంటిముందున్న కుర్చీలో కూర్చున్న యశోదమ్మ దగ్గరకు మనవరాలూ, మనవడు పరుగెత్తుకు వచ్చారు.

మనవడు ఒళ్లో కూర్చుంటే, మనవరాలు వీపుమీద చేరి రాగం తీసింది. ''ఆటలు ఆడీ పాటలు పాడీ అలసి సొలసి వచ్చాము, తియతీయని తాయిలమేదో తీసి పెట్టమ్మా...'' అనగానే మనవడు ''మా మంచి నాన్నమ్మా...'' అంటు అందుకున్నాడు.

వాళ్ళ మాటలకు మురిసిపోతూ ఆవిడ ''చిన్నా... బేబీ... ఇద్దరికీ ఇష్టమైన స్వీటు, హాటు రెడీగా ఉన్నాయి. మీరు చక్కగా స్నానాలు చేసి వస్తే.... టేబుల్ దగ్గర కూర్చుని తినేసి, హోమ్ వర్క్ కూడా మొదలు పెట్టేయండి. ఇంతలో మీ అమ్మా నాన్నా కూడా వచ్చేస్తారు...'' అని ఆవిడ చెప్పబోతోంటే, పిల్లలిద్దరూ అందుకుని ''తర్వాత అన్నాలూ తినేసి, మన ముగ్గురం కథలూ, కబుర్లు చెప్పుకుంటూ హాయిగా నిద్రపోదాం..! అంతేగా...!'' అన్నారు రాగాలు తీస్తూ.

''అవునంతే...!'' చిరునవ్వుతో ఆవిడ అనగానే, ఇంట్లోకి ఇద్దరూ రివ్వున పరుగులు తీసారు. అటువైపే మురిపెంగా చూస్తున్న ఆవిడ ''ఏమిటమ్మా... ఏం ఆలోచిస్తూ అలా చూస్తున్నావూ...?'' అని కొడుకు అడిగిన ప్రశ్నకి ఉలిక్కిపడింది.

ఒక క్షణం అయోమయంగా అటూ ఇటూ చూసింది.

''ఇదంతా నా భ్రమే నన్నమాట! పిల్లలిద్దరూ ఆటల నుండి వచ్చినట్లనిపిస్తేనూ...'' అంటూ కళ్ళు తుడుచుకుంది.

కొంచెం దూరంలో ఉన్న కుర్చీని తెచ్చుకుని తల్లి పక్కనే కూర్చుని వీరేంద్ర అనునయంగా అన్నాడు. ''ఇంకెంత అమ్మా... నాలుగు రోజులు పోతే నీ మనవలు ఇద్దరూ మనింటికి వచ్చేస్తారుగా!'' అన్నాడు నిట్టూరుస్తూ.

అవునన్నట్లు ఆవిడ తలవూపింది. ''ఏమిటో... వాళ్ళ గురించే ఆలోచిస్తూ కూర్చున్నానేమో... వాళ్ళిద్దరూ పరిగెట్టుకుని వచ్చినట్లుగా అనిపించింది! వాళ్ళు రోజంతా నాతో పాటూ ఉండకపోయినా, ఉదయం స్కూలుకి వెళ్ళే హడావుడిలో ఇల్లంతా ఎంత సందడిగా ఉంటుందో...! తర్వాత వాళ్ళెపుడు వస్తారా అని ఎదురుచూస్తూ, వాళ్ళకిష్టమైనవి చేయించి పెట్టటంతో రోజు ఎలా గడిచిపోయేదో తెలిసేదే కాదు! సాయంకాలం అయ్యేసరికి వాళ్ళిద్దరూ వచ్చేస్తారా... వాళ్ళ తేనె మాటల ఊటలతో మనసంతా నిండిపోయేది! ఇపుడేముందీ... ప్చ్... ఎడారిలో చిక్కడినట్లూ... ఊపిరాడనట్లూ ఉంటోంది! రోజు గడవటమే ఎంత కష్టంగా ఉందో...!''

బరువుగా నిట్టూర్చింది యశోదమ్మ.

''నాకూ అలాగే ఉంటోందమ్మా... ఏం చేస్తాం... ఇంకో నాలుగు రోజులు ఓపిక పట్టాల్సిందే...!'' అన్నాడు అతనూ భారంగా నిట్టూర్చి.

''నాలుగురోజులు పోతే, నిజంగా మన పిల్లలు మన దగ్గరకు వచ్చేస్తారంటావా...?'' ఆశగా అడిగిందావిడ కొడుకును.

వీరేంద్ర తల్లివైపు చిరునవ్వుతో చూశాడు. ''నీకలాంటి అనుమానం అక్కర్లేదమ్మా. తప్పకుండా వస్తారు! న్యాయం మనవైపే ఉంది!''

అతని మాటల్లో వినిపించిన ధీమాకు ఆవిడ కొంచెం ఆశ్చర్యంగా, అపనమ్మకంగానూ చూసింది.

''ఏమో... నాకు పూర్తి నమ్మకం చిక్కటం లేదు! జడ్జిగారి తీర్పు ఎలా ఉంటుందో మరి...! "

వీరేంద్ర తల్లివైపు చురుగ్గా చూసి అన్నాడు ''అటువంటి అనుమానం అక్కర్లేదని లాయరు గట్టిగా చెప్పారు కదా...! అన్ని అంశాలూ మనకు అనుకూలంగానే ఉన్నాయి! వాదనలన్నీ పూర్తయిపోయాయి. తీర్పు ఒక్కటే చెప్పాల్సి ఉంది! అంతేకదా! ఆ పైన నీ సాక్ష్యమే ... ఈ దశలో కీలకమని లాయరుగారు పదే పదే హెచ్చరించారు! నువ్వు చాలా జాగ్రత్తగా ఆ నాలుగు మాటలూ చెప్పగలగాలి! తడబడకుండా నువ్వు స్థిరంగా చెప్పగలిగితే, ఏముందీ జడ్జిగారు నీ మాటకే విలువ ఇస్తారని అంటున్నారుగా. నువ్వు.... మనసులోనే బాగా మననం చేసుకో. లాయరు చెప్పింది బాగా గుర్తు పెట్టుకో...!'' సలహా ఇచ్చాడు.

ఆవిడ చిరునవ్వుతో చెప్పింది. ''అబద్ధం చెప్పాలంటే పదే పదే గుర్తుపెట్టుకుని ఏం చెప్పాలో అది ప్రాక్టీసు చేయాలిగానీ, నిజం చెప్పటానికి ఆ అవసరం లేదు... అవునా...?''

తల్లి ప్రశ్న కు వీరేంద్ర సరదాగా చిన్నగా నవ్వుతూ ''అవుననుకో... ఒకోసారి అసత్యాలే నిజాలుగా నిరూపించబడతాయి! కొందరు లాయర్లకుగానీ, సాక్షులకుగానీ అటువంటి చాతుర్యం ఉంటుంది!'' అన్నాడు.

''అదేగా నా భయమూనూ... అలాంటిదేదైనా జరిగి మన పిల్లలు మనకు దక్కకుండా పోతారేమోననేదే నా భయం, బెంగా...!'' అంది యశోదమ్మ, ఆవిడ కంఠం గద్గదమైపోయింది కూడా!

అతనికి మళ్ళీ నవ్వొచ్చింది!

''అదేమిటమ్మా... అలా అధైర్యపడతావెందుకూ...? చెప్పానుగా, అంతా నీమీదే ఉందని. ఈ కేసులో కీలక సాక్షం చివరిగా నీదేమరి! ఇక నీ కెందుకూ సందేహం?''

కొడుకు మాటలతో కొండంత ధైర్యం వచ్చిందావిడకు.

''నా మనవలు నా ఇంటికి వచ్చేస్తే చాలును నాకు. ఇంకేం అక్కర్లేదు! ఉన్న నాలుగు రోజులూ ఆనందంగా గడిపి... దేముడి దగ్గరకు నిశ్చింతగా వెళ్ళిపోతాను!''

ఆవిడ గొంతులో ఆనందం సుళ్ళు తిరిగింది!

" మనకి ఇలాంటి గడ్డుకాలం దాపురించటానికి ఆ మహాతల్లే కారణం కదూ! ఏం చూసుకుని అంతగా విర్రవీగుతుందో నాకర్థం కావటం లేదు! పుట్టింటి తరపునుండి వచ్చిన ఆస్తిపాస్తులూ లేవు... అయినవాళ్ళ అండదండా లేవు... చేస్తున్నదేదో చిన్న చితకా ఉద్యోగం! అయినా సరే మిడిసిపాటు! పిల్లలు తనకే దక్కాలనే మొండి పట్టుదల! పిల్లలతో ఎన్ని ఖర్చులు ఉంటాయి...! ఆడపిల్లకి పెళ్ళి

చేయటం, ఒక్కటే కాదు... ఈ రోజుల్లో పెద్ద చదువూ చెప్పించాల్సి వస్తోందా, ఇద్దరు పిల్లల భారం ఎలా మోయగలనని అనుకుంటోందో... నాకైతే చాలా విడ్డూరంగా ఉంది!''

ఆవిడ కూడా కొడుకు మాటలను అంగీకరిస్తున్నట్లుగా తలవూపుతూ అంది. " అదే, నాకూ చాలా ఆశ్చర్యంగా ఉంది! ఒకటా రెండా, ఎన్నాళ్ళనుండి పిల్లల కోసం ఒంటరిపోరాటం సాగిస్తుందో! బాగా చిన్నపిల్లలైతే, తల్లికే చెందుతారు గానీ, కొంచెం పెద్దవాళ్ళయిన వాళ్ళకి తండ్రే హక్కుదారుడని తెలుసుకోవటం లేదేమిటో...!''

''అయినా ఈ వింత చూడమ్మా... పిల్లలు తనకి కావాలంటుగానీ, ఆ పిల్లల తండ్రి మాత్రం వద్దంటూ విడాకులు తీసుకుంటాననటం ఏమిటి! తనొక్కతే తన అరకొర సంపాదనతో పిల్లల్ని పెంచి పెద్ద చేయగలనని అనుకుంటోంది కాబోలు! ఇప్పటికే కొంచెం బుద్ధి వచ్చి ఉంటుంది... ముందు ముందు తిక్క కుదిరి బాగా తెలిసివస్తుంది, మన విలువ ఏమిటో...!''

అతని మాటల్లో కోపం, కాఠిన్యం తొంగిచూసాయి.

''అవును... నువ్వన్నది నిజమే...! తోడు లేకుండా సంసారభారం మోయటం అంత తేలికకాదు!''

''తనకి తెలిసిరావాలని నేననుకుంటున్నదీ... అదేగా! నువ్వే చెప్పమ్మా... ఈ రోజుల్లో... తాగటమనేది మగవాళ్ళకు సహజంగా మారిన అలవాటే కదా! ఆ మాత్రం దానికే అంత పొగరుగా నన్ను భరించలేనంటూ, విడాకులు కోరుతూ కోర్టుకెక్కుతుందా? అలాంటి దానికి బుద్ధి చెప్పాలనే నేనూ పిల్లలు నాకే కావాలంటూ పట్టుదలకు పోయాను! చట్టం మనకే అనుకూలంగా ఉన్నపుడు... ఇంకెంత కాలం పోరాడగలదులే... నీ సాక్ష్యంతో చివరి తీర్పు వచ్చేస్తుంది... ఆవిడగారికి తిక్క కుదురుతుంది! నువ్వు తనని కన్న కూతురిలా ఎంత ఆదరంగా చూసుకున్నావ్... అదంతా మర్చిపోయి నీ మనవల్ని నీకు దూరం చేసి ఇలా ఈ వయసులో నీకిలాంటి సమస్య తెచ్చి పెడుతుందా? నీ వయసు గురించి కూడా కొంచెం ఆలోచించలేదు...!'' రోషంతో వీరేంద్ర బుసలు కొట్టాడు.

కొడుకు మాటలకు కన్నీళ్ళు తుడుచుకుంటూ తల వంచుకుంది యశోద. రెండు నిమిషాలు తన ఒంటరి బ్రతుకును తలుచుకుంటూ లోలోపలే రోదించింది!

* * *

కోర్టు హాలులో కొడుకు పక్కనే మౌనంగా కూర్చున్న యశోదమ్మ తను సాక్ష్యం చెప్పాల్సిన సమయం వచ్చినపుడు మెల్లగా లేచి నిలబడింది.

తల్లికి ధైర్యం చెబుతున్నట్లుగా వీరేంద్ర ఆవిడ చేతిని పట్టుకున్నాడు. ''అమ్మా... నీకేం ఫరవాలేదు. నువ్వు చెప్పాలనుకున్నది ధైర్యంగా చెప్పేయి... జడ్జీగారు నీ మాటలకు తప్పకుండా విలువ ఇస్తారు!'' అని చెప్పాడు భరోసాగా.

అడుగులు వేస్తూ ఆవిడ ఒకసారి దూరంగా... కోడలి పక్కనే ముడుచుకుని కూర్చున్న మనవడు, మనవరాలి వైపు చూసింది! తన కొడుకూ, కోడలూ కూడా పిల్లలు తమ వద్దే ఉండాలంటూ పంతంతో

వాళ్ళని స్కూలు నుండి వచ్చేటప్పుడు వెంటబెట్టుకు వెళ్ళిపోవటం జరుగుతోంది! అటూ ఇటూ తిరుగుతూ మధ్యలో వాళ్ళు నలిగిపోతున్నారనిపించింది ఆవిడకు. ఎక్కడో అక్కడ సౌకర్యంగా, స్థిరంగా ఉండకుండా ఏమిటిదీ అని కూడా అనిపించింది.

ఆవిడ గొంతు కూడదీసుకుని తన మనసులోని మాటలను జడ్జిగారికి విన్నపంలా చెప్పుకుపోయింది!

" నా మనవలు నా కొడుకు దగ్గిరే ఉంటే, వాళ్ళకీ, నాకూ కూడా చాలా సుఖంగా, సౌకర్యంగా ఉంటుంది! నా కొడుకు మంచి ఆదాయం వచ్చే ఉద్యోగం చేస్తున్నాడు. పిల్లలు చదవాలనుకున్న చోట, ఎటువంటి ఆటంకం, అభ్యంతరం లేకుండా చదవగలుగుతారు... సౌకర్యవంతమైన జరుగుబాటు వాళ్ళకి ఉంటుందనటంలో నాకెటువంటి సందేహమూ లేదు! తల్లిదండ్రులెవరైనా పిల్లలకి మంచి భవిష్యత్తు ఇవ్వగలగాలనే కోరుకుంటారు...! "

తల్లి మాటలు వింటోన్న వీరేంద్ర వదనం వికసించింది! గెలుపు ధీమాతో.. భార్య నీరజ వైపు నిరసనగా చూశాడు! 'నీ పొగరు అణిగిందా' అన్న ప్రశ్న అతని చూపుల్లో వ్యక్తమైంది కూడా!

నీరజ నీరసంగా తలవంచుకుంది! తన ఇన్నాళ్ళ పోరాటమూ ఈ సాక్ష్యంతో నీరుకారిపోక తప్పదన్నమాట! పిల్లల చుట్టూ చేయి వేసింది. బేలగా చూసింది!

యశోదమ్మ తన మాటల్ని మెల్లగా మళ్ళీ కొనసాగించింది.

" నేను గమనించిందేమిటంటే... మా అబ్బాయికి పిల్లల పట్ల ప్రేమాభిమానాల కంటె తన పంతం నెగ్గించుకోగలగాలన్న తపనే ఎక్కువగా ఉందని! తన తాగుడు వ్యసనాన్ని నిరసిస్తూ, తనకి దూరంగా వెళ్ళిపోయిన భార్యకీ పిల్లల్ని దక్కకుండా చేసి బుద్ధి చెప్పాలన్న తపన, తాపత్రయమూ మాత్రం ఎక్కువగా ఉన్నాయి! పిల్లలకు సౌకర్యవంతమైన జీవితాన్ని నా కొడుకు ఇవ్వగలడనటంలో నాకేమాత్రం అనుమానం లేదు!

అయితే రేపో మాపో తనకి నచ్చిన అమ్మాయితో పెళ్ళి కుదిరితే, పిల్లల్ని దూరం పెట్టాలనీ.. ఏ హాస్టల్లోనో ఉంచాలనే షరతు ఉంటే... మా వీరేంద్ర ఏమాత్రం సంకోచించకుండా పిల్లల్ని దూరం పెట్టగలడు!

అదే నా కోడలైతే, పిల్లల కోసం... అటువంటి పెళ్ళినే తిరస్కరిస్తుందే తప్ప పిల్లల్ని మాత్రం వదులుకోదు! ఇది నేను ఖచ్చితంగా చెప్పగలను! ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించకపోయినా, పుట్టింటి వాళ్ళ సహకారం లోపించినా, ఒంటరిగా ఇన్నాళ్ళు పిల్లలకోసం ఓపికగా పోరాటం సాగిస్తున్న తీరు చూసినవాళ్ళకెవరికైనా ఈ విషయం అర్థమౌతుంది!

విలాసవంతమైన జీవితం లభించకపోవచ్చునుగానీ నా కోడలి పెంపకంలో నా మనవలు క్రమశిక్షణ కలిగిన మంచి పౌరులుగా పెరుగుతారని నమ్మకంగా చెప్పగలను!

తల్లని అంటిపెట్టుకుని కూర్చుని, అమ్మకు దూరం అవుతామేమోననే బెంగతోచూస్తున్న మనవరాలు, మనవడినీ చూశాక, వాళ్ళు తల్లితో పాటే ఉండటం మంచిదనే అభిప్రాయం కలిగింది! నా మనవల్ని తల్లినుండి వేరు చేయవద్దని నేను మనఃస్ఫూర్తిగా జడ్జిగారికి విన్నవించుకుంటున్నాను. నా కోరికను మన్నించి సరైన తీర్పును ఇవ్వమనీ వేడుకుంటున్నాను! "

ఆవిడ మాటలు ముగించగానే జడ్జిగారి తీర్పు ఏమిటో వెలువడకముందే అందరికీ అర్థమైపోయింది! వీరేంద్ర మొహం చిన్నబుచ్చుకుని.. చిరాకుగా అక్కడ నుండి వెళ్ళటానికి లేచాడు.

బోను దిగివచ్చిన యశోదమ్మ దగ్గరకు నీరజ పరుగున వచ్చింది పిల్లలతో.

''అమ్మా... ఈ రోజు నాకు మీరు చేసిన మేలును ఈ జన్మలో మరిచిపోలేను! నాకో గొప్ప వరం ప్రసాదించారు! మీరూ నా దగ్గరకు వచ్చి... మీ మనవలతో పాటుగా ఉండాలి! మిమ్మల్ని అపురూపంగా చూసుకుంటూ సేవించుకుంటాను!'' ఆవిడ చేతుల్ని పట్టుకుని నీరజ కన్నీళ్ళతో ప్రాధేయపడింది.

యశోదమ్మ పిల్లల్ని ఓ క్షణం ముద్దాడింది! ''పిల్లల కోసం ఎంత ఆర్తిగా పోరాటం సాగిస్తున్నావో జడ్జిగారికి తెలియజేసానంతే కదమ్మా...! ఇన్నాళ్లు మనవలతో గడిపిన ముచ్చట్ల జ్ఞాపకాలు చాలు నాకు! నీ దగ్గరికి రమ్మన్నావు···నాకు తెలుసునమ్మా... ఏ లోటూ లేకుండా నన్నూ చూసుకోగలవని! కానీ... '' అంటూ ఓ క్షణం ఆగిపోయిన యశోదమ్మ మెల్లగా అంది ''నేనూ తల్లినే కదా... చివరి వరకూ నా కొడుకును కనిపెట్టుకునే ఉంటాను! ఎలాంటి సమస్యలు వచ్చినా తట్టుకుంటాను...!''

కొడుకును అనుసరిస్తూ... అతను వెళ్ళిన వైపే అడుగులు వేసింది యశోదమ్మ.

* * *